క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల షెడ్యూల్ విడుదల

వైవీయూ: కడప నగరంలోని వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల(స్వయంప్రతిపత్తి) 2024–25 సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల టైం టేబుల్‌ను స్థానిక పక్కీరుపల్లెలోని కళాశాలలో కరస్పాండెంట్ డిఎస్ఆర్.మనోహర్‌ఎడ్డి, డైరెక్టర్ డా.ఎస్‌పి.మధుసూదన్‌రెడ్డి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలకు స్వయంప్రతిపత్తి హోదా వచ్చిన తర్వాత తొలి సారిగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగమణి, పి. మస్తాన్‌బి, రేణుక, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రయాణ భత్యం మంజూరు

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా 1274 మంది విద్యార్థులకు ప్రయాణ భత్యం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులివ్వడంతో ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సివి.ప్రసాద్, కడప జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర , ఆలీఖాన్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు ఆ మొత్తాన్ని ప్రయాణ ఖర్చుగా వినియోగించుకోవాలని ఉత్తర్వులో పేర్కొందన్నారు. ఎంపికైన విద్యార్థికి 10 నెలల ప్రయాణ భత్యం రూ.6వేలు మంజూరు చేసినట్లు తెలిపారు.

పైపులైన్‌కు మరమ్మతులు

కడప కార్పొరేషన్: కడప నగరానికి తాగునీరు అందించే ప్రధాన పైపులైన్ బైపాస్‌లో పునీత్ బార్ ఎదురుగా పగిలిపోయింది. గ్యాస్ పైపులైన్ పనులతో లీకేజీ ఏర్పడి సుమారు నెలరోజులుగా తాగునీరు వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఈ విషయాన్ని ఈ నెల 12న పగిలిపోయిన ప్రధాన పైపులైన్ శీర్షికన సాక్షి అధికారుల దృష్టికి తెచ్చింది. స్పందించిన అధికారులు జేసీబీతో గుంత త్రవ్వి పైపులైన్ లీకేజీని నియంత్రించారు.

వ్యాసరచన పోటీలు

కడప కోటిరెడ్డిసర్కిల్: బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నగరం లోని ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామని ఐసీడీఎస్ పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మి తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే బాలల దినోత్సవంలో జ్ఞాపిక అందజేస్తామని ఆమె వివరించారు.

అంబేడ్కర్ భవన్‌ను అందుబాటులోకి తేవాలి

కడప రూరల్: కడప నగరంలో నిరుపయోగంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌ను అందుబాటులోకి తేవాలని ఏపీ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు జాకట విజయశేఖర్ తెలిపారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను బుధవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ భవనం ఎస్సీ వర్గాల శుభ కార్యక్రమాలు, మీటింగ్‌లకు ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. జిల్లా అధ్యక్షులు పాలెం సంజీవయ్య, జే.దినేష్, చెంచులడేవిడ్, పాల్గొన్నారు.

సారస్వత నిలయంగా జిల్లా గ్రంథాలయం


కొండాయపల్లెలోని గ్రంథాలయం

కడప కల్చరల్: కవులు రాసిన ఎన్నో గ్రంథాలు, కావ్యాలు నేటికీ జిల్లా కీర్తిని చాటుతున్నాయి. వారికి జిల్లా గ్రంథాలయ సంస్థతో ఎంతో అనుబంధం ఉంది. తమ సాహిత్యాన్ని అభివృద్ధి చేసుకొనేందుకు గ్రంథాలయాలను సందర్శిస్తారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పాతికేళ్ల క్రితం కడప నగరం చెన్నూరు బస్టాండులోని రామకృష్ణ మఠంలో ఉండేది. 1960లో మఠం నిర్వాహకులు భవనంలోని హాల్‌లో దిన, వారపత్రికల పఠన కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అనంతరం ఆ భవనాన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థకు కేటాయించారు. ఆనాడు కార్యదర్శులుగా ఉన్న డాక్టర్ వెలగా వెంకటప్పయ్య, వీణా రమాపతి రాజు, వెంకట సుబ్బయ్య స్వతహాగా సాహిత్యాభిమానులే. పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు ఈ భవనానికి సమీపంలోని రామకృష్ణ హైస్కూల్‌లో తెలుగు పండితులుగా పనిచేస్తూ అప్పట్లో ఇక్కడికి వచ్చి పుస్తకాల మధ్యే గడిపేవారని పెద్దలు చెబుతారు. సాహితీవేత్తలైన భూతపురి సుబ్రమణ్యశర్మ, జానమద్ది హనుమచ్ఛాస్త్రి, నాటి యువ కవులు ఎన్‌సీ.రామసుబ్బారెడ్డి, కవి సుబ్బరాయుడు, ఎన్. జానకిరాంలకు ఈ గ్రంథాలయంతో అనుబంధం ఉంది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 63 గ్రంథాలయాలు ఉన్నాయి. కడప నగరంలో కేంద్ర గ్రంథాలయం, ఇతర ప్రాంతాల్లో ఉన్న శాఖా గ్రంథాలయాలు దాదాపు అన్నీ సొంత భవనాల్లోనే ఉన్నాయి. పుస్తకాల సంఖ్య పెంచారు. కేంద్ర గ్రంథాలయ భవనం ప్రముఖ సాహిత్య కేంద్రంగా విలసిల్లుతోంది. ఏడాదిలో పదుల సంఖ్యలో సాహితీ సదస్సులు, సభలు, కవి సమ్మేళనాలు జరిగాయి. ఆధునికతను అందిపుచ్చుకోవడంలో భాగంగా వేముల మండలంలో ఇటీవల డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటుచేశారు.

ఈ నెల 14 నుంచి బాలల దినోత్సవాన్ని ప్రభుత్వ గ్రంథాలయాల్లో వారం రోజులపాటు నిర్వహించనున్నారు. దీంతో ఆ భవనాలు విద్యార్థుల సందడి, భావి పాఠకులతో కళకళలాడనున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లోనూ వారోత్సవాలు నిర్వహించేందుకు గ్రంథాలయ శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మాదక ద్రవ్య రహిత సమాజం కోసం కృషి

● న్యాయమూర్తి బాబా ఫకృద్దీన్


విద్యార్థులకు వీల్ చైర్లను అందజేస్తున్న న్యాయమూర్తి బాబా ఫకృద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్: మాదక ద్రవ్య రహిత సమాజంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యాయమూర్తి బాబాఫకృద్దీన్ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిన వారికోసం ఇంతియాజ్ అలీ ఆధ్వర్యంలో నగరంలోని బిల్టప్ సర్కిల్ ఈద్గా ఎదురుగా ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పూర్తిగా డ్రగ్స్ బానిసలుగా మారడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణకిశోర్, వైద్యులు పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీ

విభిన్న ప్రతిభావంతులకు సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్ బుధవారం హియరింగ్ మిషన్లు, మానసిక వీల్ చైర్లు పంపిణీ చేశారు. కడప నగరంలోని ద్వారకా నగర్‌లో ఉన్న ఆశ్రయ ఆకృతి ప్రత్యేక పాఠశాల, నగరంలోని పాత రిమ్స్‌లో మానసిక వికలాంగుల కేంద్రం, దర్శిని హ్యాండీక్యాఫ్డ్ వెల్ఫేర్ సొసైటీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చట్టాలు, అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆరుగురు ఆశ్రయ ఆకృతి ప్రత్యేక పాఠశాలల పిల్లలకు హియరింగ్ మిషన్లతోపాటు అల్‌షిఫాలో ఉన్న మానసిక వికలాంగుల కేంద్రం విద్యార్థులకు రెండు వీల్ చైర్లు, రెండు హియరింగ్ మిషన్లు, దర్శిని హ్యాండీక్యాఫ్డ్ వెల్ఫేర్ సొసైటీ స్పెషల్ ఫర్ హియరింగ్ అండ్ మెంటల్లీ రెటార్డెడ్ పిల్లలకు రెండు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కిట్, వీల్ చైర్, ట్రై సైకిల్ అందజేశారు.

నేర్చిన అంశాలను పరిశోధనల్లో వినియోగించాలి


అభ్యర్థులతో వైవీయూ అధికారులు, అధ్యాపకులు

వైవీయూ: శిక్షణలో నేర్చుకున్న అంశాలు.. పరిశోధనల్లో వినియోగించుకొని క్షేత్ర స్థాయిలో అభివృద్ధి చేయాలని వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ అన్నారు. యోగి వేమన విశ్వ విద్యాలయంలో ×భూగర్భ నీటి వనరుల సుస్థిరత– నిర్వహణ×పై మూడు రోజుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పుత్తా పద్మ మాట్లాడుతూ సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ జలవనరులు (సీజీడబ్ల్యూబి), నదుల అభివృద్ధి, గంగా పునరుజ్జీవన శాఖ, జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ×గ్రౌండ్ వాటర్ సోర్స్ సస్టైనబిలిటీ అండ్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. సీజీడబ్లూబీ ప్రాంతీయ డైరెక్టర్ జి.కృష్ణమూర్తి కడప జిల్లాలో నీటి వనరుల అధ్యయనం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆచార్య తుమ్మలకుంట శివప్రతాప్, ఆచార్య కె.రఘుబాబు హాజరైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ శిక్షణలో అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దదర్గా ఉరుసుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి


పెద్ద దర్గా ఉరుసు ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో ప్రసిద్ధిగాంచిన పెద్దదర్గా ఉరుసుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో ఆయన మాచుపల్లి బస్టాండు, మాసాపేట సర్కిల్, శివలింగం బీడీఫ్యాక్టరీ, కళాక్షేత్రం, వైవీ స్ట్రీట్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాచుపల్లి బస్టాండ్ సమీపంలోని ఖాళీ స్థలాన్ని శుభ్రపరచి, ఆ ప్రదేశంలో ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. ఉరుసు జరిగే ప్రాంతం, ఆ మార్గాలను కూడా పూర్తిగా శుభ్రపరచాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని కూడా శుభ్రపరచి, చిరుధాన్యాలతో చేసిన తినుబండారాల స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, మునిరత్నం, కన్నయ్య, విజయభాస్కర్ గౌడ్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ వర్షాలకే రహదారులు జలమయం



మాట్లాడుతున్న మహమ్మద్ అలీ ఖాన్

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా కేంద్రమైన కడప నగర రహదారులు సాధారణ వర్షాలకే జలమయమవుతున్నాయని ఏపీ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీఖాన్ అన్నారు. నగరంలోని ఇందిరా భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. గత ప్రభుత్వం సుమారు రూ.69 కోట్లతో 23 ప్రధాన వరద కాలువల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించినా.. తెదేపా ప్రభుత్వం ముందడుగు వేయలేదన్నారు. కాల్వల నిర్మాణం పూర్తిగాక ఇల్లు, వాకిళ్లు రోడ్లు, జనావాసాలు నీటి ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఆధిపత్య పోరుతో అజెండాపై చర్చ లేకుండానే కడప కార్పొరేషన్ సమావేశం ముగియడం దారుణమన్నారు. సమస్యలపై దృష్టి పెట్టని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ ఎం.రహంతుల్లా ఖాన్, చిన్న కుల్లాయప్ప, శ్యామలమ్మ, సంజయ్‌కాంత్, రఫీ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

దురాచారాలపై సామాజిక చైతన్యం కల్పించారు


మాట్లాడుతున్న మూల మల్లికార్జునరెడ్డి

కడప కల్చరల్: దార్శనికుడు, కాలజ్ఞాని పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి 17వ శతాబ్దంలోనే ఆనాటి దురాచారాలపై సామాజిక చైతన్యం కల్పించారని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి అన్నారు. వీరబ్రహ్మేంద్రుడి జీవితం–సంఘ సంస్కరణ అంశాన్ని కళాశాల డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చిన సందర్భంగా స్థానిక శ్రీహరి డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి బుధవారం ఆయన మాట్లాడుతూ 17వ శతాబ్దంలోనే బ్రహ్మంగారు సిద్దయ్య, కక్కయ్యలను శిష్యులుగా చేర్చుకోవడం, మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడం తన ఇంటి నుంచే వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రారంభించడం అప్పట్లో సామాజిక విప్లవాలుగా భావించవచ్చన్నారు. స్త్రీ సమానత్వం కోసం కృషి చేశారని, సర్వమాత సమానత్వానికి పాటుపడ్డారని, జంతు బలులు నిషేధించి మూఢ విశ్వాసాలను ఖండించారన్నారు. గురువు ప్రాధాన్యం తెలియజెప్పి నైతిక విలువలను వివరించారన్నారు. తెలుగు అధ్యాపకులు జయప్రకాశ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్‌ఐసీ యూనియన్ కళాజాత

కడప కల్చరల్: జీవిత బీమా సంస్థ ఉద్యోగుల కళాజాత కార్యక్రమం గురువారం ప్రారంభించనున్నట్లు ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘం కార్యాలయం, స్థానిక ఆర్టీసీ ఆవరణలో జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు కడప నగరం రాజీవ్ పార్క్ దగ్గర జరిగే ఆట–పాటలతో కళాజాత ప్రారంభం అవుతుందన్నారు. ఎల్‌ఐసీ పాదుపుపై జీఎస్టీ తొలగించాలని, దీంతోపాటు ఎఫ్‌డీఐ పరిమితి పెంచే ఆలోచన విరమించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎల్‌ఐసీ యూనియన్ కార్యాలయం ఆవరణలో కళాజాతకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘం అధ్యక్షుడు వుండేల నాగమునిరెడ్డి, ఎల్‌ఐసీ పింఛనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కె.సుధీకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, వసుప్రద, ఫర్వీన్, సుబ్బమ్మ, సునీత, లక్ష్మీదేవి, నారాయణ, మల్లయ్య సుభాన్, సుబ్బరాయుడు, నాగయ్య, పుల్లయ్య, రమణ, శీను తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

కడప స్పోర్ట్స్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్–14, అండర్–17, అండర్–19 బాలికల విభాగంలో మొత్తం ఏడుగురు క్రీడాకారిణులు ఎంపికయ్యారు. నవంబర్ 9 నుంచి 12వ తేదీ వరకు విజయనగరంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–14 రాష్ట్రస్థాయి బాలికల పోటీల్లో వైఎస్ఆర్ కడప జట్టు విజయం సాధించడంలో క్రీడాపాఠశాల విద్యార్థినులు కీలకపాత్ర పోషించారు. టి. భువనేశ్వరి, బి. భార్గవి, ఎన్. నాగతనూజ, జి. సృజనగ్లోరీలు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో త్వరలో వారణాసిలో నిర్వహించనున్న జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాపాఠశాలకు చెందిన వి. సోమిత, ఎస్. ఆఫ్రీన్‌లు పాల్గొని సత్తాచాటడంతో వీరిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అదే విధంగా అండర్–19 విభాగంలో వి. కుసుమప్రియ నేషనల్స్‌కు ఎంపికైంది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులను, వాలీబాల్ శిక్షకుడు కె. శ్రీనివాసరాజును ౖౖ. జగన్నాథరెడ్డి అభినందించారు.

బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

వేముల : జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు అండర్–17 బాలికల విభాగంలో వేముల మండలం వి.కొత్తపల్లె జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అంజలి ఎంపికైనట్లు హెడ్మాస్టర్ నరసింహరావు తెలిపారు. ఈనెల 9, 10, 11వ తేదీలలో గుంటూరు జిల్లాలో జరిగిన అండర్–17 బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలలో అంజలి విశేష ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపికైందన్నారు. డిసెంబర్ 2వ తేదీ నుంచి 7వ తేదీవరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలలో పాల్గొంటుందని ఆయన తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు..

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రసన్నకుమారి, పల్లవి జాతీయ స్థాయి అండర్–19 హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అరుణకుమారి తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకు రైల్వేకోడూరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్–19 హ్యాండ్‌బాల్ పోటీల్లో కడప జిల్లా జట్టును రెండో స్థానంలో నిలిపినట్లు ఆమె తెలిపారు. డిసెంబర్ 11 నుంచి లూథియానాలో జరగబోయే అండర్–19 హ్యాండ్‌బాల్ పోటీలలో వీరు పాల్గొంటారన్నారు.

పదోన్నతుల విషయంలో న్యాయం చేయాలి

కడప ఎడ్యుకేషన్: మున్సిపాలిటీ పరిధిలో హెచ్‌ఎంల పదోన్నతుల విషయంలో తమకు న్యాయం చేయాలని హెచ్‌ఎంలు పుష్పకుమారి, మరియారాణి కోరారు. విలేకరులతో వారు మాట్లాడుతూ కడప డీఈఓ కార్యాలయంలో పదోన్నతులు నిర్వహించారన్నారు. 2000లో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయవృత్తి పొంది 24 ఏళ్లుగా మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో పనిచేస్తున్నామని, తమకు అన్ని అర్హతలున్నా పదోన్నతి లభించకపోవడం అన్యాయం అన్నారు. ఆర్జేడీకి సమస్య విన్నవించినా తగిన న్యాయం చేయలేదని, తక్కువ మార్కులు, ర్యాంకులు ఉన్నవారికి పదోన్నతి కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులమని అధికారులు తమను చిన్న చూపు చూస్తున్నారన్నారు. డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌తో మాట్లాడగా హెచ్‌ఎం పదోన్నతికి వారు అర్హులు కాదని, అందుకే పదోన్నతి కల్పించలేకపోయామని తెలిపారు.

'108' సమస్యలను పరిష్కరించాలి

కడప రూరల్ : 108 అంబులెన్స్ సర్వీసెస్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని 108 అంబులెన్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 108 అంబులెన్స్ సర్వీస్ నిర్వహణను ఇతరులకు అప్పగించకుండా ప్రభుత్వమే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌తో పాటు అసోసియేషన్ నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తరలింపు యోచన తగదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్ని కార్యాలయాలను అమరావతిలో కేంద్రీకరించాలని భావిస్తున్న నేపథ్యంలో నూతనంగా ఏర్పడబోతున్న ఏపీజీబీ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించుకుపోతారనే ఆందోళన సిబ్బందితో పాటు ఈ ప్రాంత ప్రజల్లో ఉందని ఏపీజీబీ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.జగదీశ్వర్‌రెడ్డి, ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి.మహమ్మద్, ఏపీజీబీ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేష్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ కడప ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న ఏపీజీబీ మిగతా గ్రామీణ బ్యాంకులతో పోలిస్తే అతి పెద్దది కావడం, ఈ నేపథ్యంలో కడప నుంచి ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించుకుపోకుండా చూడాలని వారు కోరారు.

పదోన్నతుల కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్ : కడప, ప్రొద్దుటూరు పరిధిలోని నగర పాలక, మున్సిపల్ హైస్కూళ్లలో పనిచేస్తున్న ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించినట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. బుధవారం సాయంత్రం కడప డీఈఓ కార్యాలయంలో డీఈఓ ఆధ్వర్యంలో ఈ పదోన్నతి కార్యక్రమం నిర్వహించారు. కడప గాంధీనగర్ హైస్కూల్‌లో పనిచేస్తున్న అఫ్రపూన్, మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో పనిచేస్తున్న విజయలక్ష్మి పదోన్నతి కల్పించారు. అలాగే ప్రొద్దుటూరు వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో పనిచేస్తున్న సుజాతమ్మ, వైఎంఆర్ గరల్స్' హైస్కూల్‌లో పనిచేస్తున్న లక్ష్మినరసమ్మ, మున్సిపల్ హైస్కూల్ 2వ వార్డులో పనిచేస్తున్న విజయభాస్కర్‌కు పదోన్నతి లభించింది. ఈ కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్, సూపరింటెండెంట్ ఇక్బాల్, క్లర్క్ శివకుమార్‌తోపాటు డీఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డినెన్స్ జారీ చేయాలి

కడప రూరల్ : సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా ప్రభుత్వం తక్షణం ఎస్సీ వర్గీకరణ కోసం ఆర్డినెన్స్‌ను జారీ చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన దండు వీరయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేపట్టే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, బాల లక్షుమ్మ, సుబ్బలక్ష్మి, పుల్లయ్య, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు నిరాశ

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను తీవ్ర నిరాశ పరిచిందని ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ఎండీ ఇలియాస్ బాషా, నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డిలు పేర్కొన్నారు. కడప ఎస్టీయూ భవన్‌లో బుధవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో బకాయిలకు సంబంధించి ఎలాంటి చెల్లింపులు లేకపోవడం అన్యాయమన్నారు. దీంతోపాటు 12 వ పీఆర్‌సీ ప్రస్తావన లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తే తిరిగి ఉద్యమ బాట పట్టేందుకు ఉద్యోగులంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

త్రుటిలో తప్పిన రోడ్డు ప్రమాదం

వేంపల్లె : స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో రోడ్డు ప్రమాదం త్రుటిలో తప్పింది. బుధవారం సాయంత్రం పులివెందుల నుంచి కడప రోడ్డు వైపు వెళుతున్న తుఫాన్ వాహనం వేంపల్లెలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్దకు రాగానే డ్రైవర్ నరసింహారెడ్డికి మూర్ఛ వచ్చింది. దీంతో రోడ్డుపై నిలిపిన మోటార్ బైకును ఢీకొట్టి కొద్ది దూరం వెళ్లి వాహనం నిలిచిపోయింది. ఈ సమయంలో మోటార్ బైకు వద్ద గాని రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం త ప్పింది. కొద్ది దూరంలో విద్యుత్ స్తంభం కూడా ఉంది. అయితే వాహనం నిలిచిపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. వాహనంలో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

కడప అర్బన్ : కమలాపురం పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన పి.ఆంజనేయులు నాయక్(ఏఎ 2083) కుటుంబానికి జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు రూ.2.5 లక్షల ఆర్థిక సాయాన్ని జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) ప్రకాష్ బాబు అందజేశారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీసు వితరణ నిధి నుంచి ఈ ఆర్థిక సాయం అందజేశారు. హోంగార్డ్ ఆంజనేయులు నాయక్ తల్లి పి.ధార్మి ఈ ఆర్థిక సాయం అందుకున్నారు. కార్యక్రమంలో ఎస్.జ్యోతి, దూలం సురేష్, శ్రీనివాసులు నాయక్, మహజబీన్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

కడప అర్బన్: తప్పిపోయిన బాలికను పోలీసులు క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల 8వ తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు అదృశ్యమయ్యారు. వారి తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. విచారించగా వారు తిరుపతిలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బుధవారం వారిని పిలిపించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇంటిలో పనులు చేయడం లేదని మందలించడంతో వెళ్లినట్లు వారు తెలిపారు.

జలచరాల నిల్వపై శిక్షణ

వైవీయూ: నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల విద్యార్థుకు జలచర జీవుల నిల్వ పద్ధతులపై శిక్షణ పొందేందుకు నెల్లూరుకు వెళ్లారని అధ్యాపకులు డాక్టర్ పి.రవి శేఖర్, డా.వై.సావిత్రి తెలిపారు. కళాశాల జంతు శాస్త్ర విభాగం విద్యార్థుల బృందం నెల్లూరు సీబైట్స్ ఫిషరీస్ ఇండస్ట్రీస్‌లో చేపలు, రొయ్యలలో పోషక విలువలు, నిల్వచేసే విధానాలపై మూడు రోజులపాటు శిక్షణ పొందనున్నట్లు వారు తెలిపారు. సీబైట్స్ ఫిషరీస్ ఇండస్ట్రీస్ ఎండీ శరత్‌కుమార్‌రెడ్డి నిల్వచేసే విధానాలను వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచి నడవడికతోనే చక్కెర వ్యాధికి అడ్డుకట్ట

కడప రూరల్: మంచి నడవడికతో షుగర్ వ్యాధికి అడ్డుకట్ట వేయవచ్చని డాక్టర్ టి.రంగప్రసాద్ అన్నారు. ప్రపంచ చక్కెర దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక శ్రీరంగ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ షుగర్ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. క్రమం తప్పకుండా నడవడం, వ్యాయామం చేయడం చేయాలన్నారు. యోగా లాంటివి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఫాస్ట్ ఫుడ్, జింక్ ఫుడ్, కూల్‌డ్రింక్స్, ధూమపానం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే తక్షణమే వైద్యుడిని సంప్రదించాలన్నారు.

ప్రణాళికా బద్ధంగా వ్యవహరిస్తే ప్రథమ స్థానం

వైవీయూ: ప్రణాళిక బద్ధంగా అత్యున్నతమైన నిర్ణయాలు తీసుకొని వాటిని అమలు చేయగలిగితే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రథమ స్థానంలో ఉంటుందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రమ్ వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) నిపుణులు స్పష్టం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఏర్పాటు చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ నిపుణుల బృందం ప్రతినిధులు యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ బి.రాజశేఖర్, యూనివర్సిటీ ఆఫ్ కలకత్తా ప్రొఫెసర్ పీయూష కాంతి పాణిగ్రహి, పూణేలోని సావిత్రిబాయి పుణె విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సంజయ్ ధోలే, తదితరుల బృందం బుధవారం యోగి వేమన విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. అనంతరం ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ఐక్యూఏసీ సంచాలకులు డాక్టర్ ఎల్. సుబ్రహ్మణ్యం శర్మ, డీన్ ఆచార్య కె.గంగయ్య, ఆచార్యులు రామచంద్రారెడ్డి, చంద్రఓబుళరెడ్డిలతో వారు భేటీ అయ్యారు. డాక్టర్ సుబ్రహ్మణ్యంశర్మ వైవీయూ ప్రొఫైల్‌ను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై బృందం సభ్యులు మాట్లాడుతూ ర్యాంకింగ్‌ను ఎలా మెరుగుపరచుకోవాలో మార్గనిర్దేశం చేశారు. బోధన, అభ్యాసం, అవసరమైన అధునాతనమైన వనరులు సంసిద్ధం చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన పరిశోధన, వృత్తిపరమైన అభ్యాసాలు నిరంతరం కొనసాగాలన్నారు. సేవల సమాచారం ప్రజలకు చేరువలో ఉండాలని, విద్యార్థుల ప్రవేశం, ప్లేస్‌మెంట్, ఇంటర్న్‌షిప్, ఫెలోషిప్‌లపై ఏకాగ్రత పెంచాలని సూచించారు. ఉత్తమ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు పొందడానికి ఉపాధి ఆధారిత, మల్టీ డిసిప్లినరీ కోర్సులు ప్రారంభించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, సమన్వయకర్తలు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.